## పదవ ప్రకరణం

# మంత్రించి ఊదటం, తావీజులు కట్టటం

## (1) మంత్రించి ఊదటం (రుఖయ) :

అంటే బాధలో ఉన్న వ్యక్తిపై ఏదైనా పఠించి ఊదటం. ఉదాహరణకు : జ్వరం, మూర్ఛ రోగం, తదితర జబ్బులున్న వ్యక్తి. దీనిని మంత్రం అని కూడా అంటారు. ఇది రెండు రకాలు :

**మొదటి రకం :** షిర్క్ ప్రమేయం లేని మంత్రం. సూటిగా చెప్పాలంటే దివ్య ఖుర్ఆన్‌లోని సూక్తులనుగానీ, దైవనామాలను గానీ పఠించి అతన్ని దేవుని రక్షణలో ఇవ్వటం (రోగి స్వస్థత కోసం అల్లాహ్‌ను అర్థించటం). ఈ రకమయిన మంత్రం ధర్మసమ్మతమే. ఎందుకంటే దైవప్రవక్త (ﷺ) ఈ విధంగా మంత్రించటమే గాక, దీనిని సమ్మతంగా ఖరారు చేశారు. ఆ మేరకు ఆజ్ఞాపించారు కూడా.

ఔఫ్ బిన్ మాలిక్ (رضي الله عنه) ఇలా అంటున్నారు : మేము అజ్ఞాన కాలంలో మంత్రించి ఊదేవారం. అందుకే మేము, 'ఓ దైవప్రవక్తా! దీని గురించి తమరి అభిప్రాయం ఏమిటి?' అని ప్రశ్నించాం. దానికాయన (ﷺ),

"اِعْرِضُوا عَلَيَّ رُقَاكُمْ، لَا بَأْسَ بِالرُّقَى مَالَمْ تَكُنْ شِرْكًا" (مسلم)

**"మీ మంత్రాలేమిటో నా ముందు సమర్పించండి. షిర్క్ ప్రమేయం లేకుండా ఉన్నంతవరకూ మంత్రించి ఊదటంలో అభ్యంతరం ఏమీ లేదు" అన్నారు. (సహీహ్ ముస్లిం)**

అల్లామా సుయూతీ (رحمه الله) ఇలా అంటున్నారు : మంత్రించి ఊదటం ధర్మసమ్మతమే అనే విషయంలో విద్వాంసుల మధ్య ఏకాభిప్రాయం ఉంది. కాకపోతే అది మూడు షరతులకు కట్టుబడి ఉండాలి.

**మొదటి షరతు** : దైవ వచనాల, దైవనామాల ఆధారంగా మంత్రించి ఊదాలి.

**రెండవ షరతు** : అది అరబీ భాషలో ఉండాలి. దాని భావం స్పష్టంగా ఉండాలి.

**మూడవ షరతు** : మంత్రం స్వతహాగా ప్రభావపూరితం (ప్రయోజనకరం) కాదని, దేవుని విధివ్రాత ప్రకారమే దాని ప్రభావం ఉంటుందని నమ్మకం కలిగి ఉండాలి. (ఫత్‌హుల్ మజీద్ : పేజీ – 135)

మంత్రించే పద్ధతి ఏమిటంటే, నిర్ణీత దైవవచనాలను పఠించి రోగిపై ఊదాలి. లేదా నీటిపై మంత్రించి దానిని రోగికి త్రాగించాలి. సాబిత్ బిన్ ఖైస్ (رضي الله عنه) హదీసు ద్వారా ఈ విషయం రూఢీ అవుతోంది : "దైవప్రవక్త (ﷺ) బత్‌హాన్ నుండి కొద్దిగా మట్టి తీసుకున్నారు. దానిని ఒక పాత్రలో వేశారు. ఆ నీటిపై ఏదో పఠించి ఊదారు. తరువాత ఆ నీటిని ఆయనపై కుమ్మరించారు." (అబూదావూద్–3885 జయీఫుల్ అస్‌నాద్, కితాబుత్తిబ్, సహీహ్ ఇబ్నె హిబ్బాన్ – 1418)

**రెండవ రకం :** షిర్క్‌కు ప్రమేయం ఉన్నది. అంటే దైవేతరుల సహాయం అర్థించే మంత్రతంత్రాలు. ఇందు నిమిత్తం దైవేతరులను మొరపెట్టుకోవటం, వారి సహాయం కోరటం, వారి శరణుజొచ్చటం, జిన్నాతుల పేర్లతో, ప్రవక్తల పేర్లతో, దైవదూతల పేర్లతో, పుణ్య పురుషులపేర్లతో మంత్రించి ఊదటం – ఇదంతా దైవేతరులను మొరపెట్టుకోవటం క్రిందికే వస్తుంది. ఇది షిర్కె అక్బర్. లేదా అరబీలో గాకుండా వేరితర భాషల్లో ఉండే మంత్రాలు. అర్థంకాని విధంగా – అస్పష్టంగా – ఉండే మంత్రాలు. వాటిలో అవిశ్వాసంతో, షిర్కుతో కూడిన వాక్యాలు ఉండవచ్చు. ఆ విషయం మనకు తెలీకనూ పోవచ్చు – ఈ విధమయిన మంత్రాలు కూడా సమ్మతం కావు.

## (2) తావీజులు

అంటే దిష్టి తగలకుండా ఉండేందుకు చిన్న పిల్లల మెడలో వ్రేలాడదీసే త్రాళ్లు. ఒక్కోసారి వృద్ధ స్త్రీ పురుషుల మెడలో కూడా ఇలాంటివి వ్రేలాడదీయబడతాయి.

### తాయెత్తులు రెండు రకాలు

**మొదటి రకం :**

ఖుర్‌ఆన్ ఆధారంగా కట్టే తావీజులు. అంటే ఖుర్‌ఆనీ సూక్తులను లేదా అల్లాహ్ నామాలను, గుణాలను లిఖించి, వ్యాధి నివారణ పొందే ఉద్దేశంతో వ్రేలాడదీయబడేవి. ఈ విధమయిన తావీజులకు సంబంధించి ఇస్లామీయ విద్వాంసులలో భిన్నాభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలో రెండు ఉద్ఘాటనలున్నాయి.

**మొదటిది :** ఈ విధమయిన తావీజు వ్రేలాడదీయటం సమ్మతమే. ఇది అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (رضي الله عنه) పలుకు. హజ్రత్ ఆయిషా (رضي الله عنها) ద్వారా ఈ విధంగానే ఉల్లేఖించబడినది. అబూ జాఫర్ అల్ బాఖర్ మరియు వేరొక ఉల్లేఖనంలో అహ్మద్ బిన్ హంబల్ (رحمه الله) ఉవాచ కూడా ఇదే. వీరంతా తావీజులు వ్రేలాడదీయరాదనే హదీసును గురించి వ్యాఖ్యానిస్తూ, "అది షిర్కుతో కూడిన తావీజులకు సంబంధించిన హదీసు" అని అభిప్రాయపడ్డారు.

రెండవది : ఈ రకమయిన తావీజులు వ్రేలాడదీయటం ధర్మసమ్మతం కాదు. ఇది అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్, ఇబ్నె అబ్బాస్ (رضي الله عنهم) ల ఉవాచ. హుజైఫా, ఉఖబా బిన్ ఆమిర్, ఇబ్నె ఉకైమ్ (رضي الله عنهم) ప్రభృతులు కూడా ఇలాగే అభిప్రాయపడ్డారు. తాబయీల ఒక జమాఅత్ కూడా ఇంచుమించు ఇలాగే అభిప్రాయపడింది. వీరిలో ఇబ్నె మస్‌ఊద్ (رضي الله عنه) శిష్యులు, వేరొక ఉల్లేఖనం ప్రకారం ఇమామ్ అహ్మద్ కూడా ఉన్నారు. వీరి శిష్యుల్లో కూడా చాలామంది ఇదే అభిప్రాయాన్ని అవలంబించారు. తరువాతి తరాల వారు కూడా దీనికి కట్టుబడ్డారు. ఇబ్నె మస్‌ఊద్ (رضي الله عنه) గారి ఈ క్రింది హదీసు వారి కట్టుబాటుకు నిదర్శనంగా ఉంది :

"إِنَّ الرُّقَى وَالتَّمَائِمَ وَالتِّوَلَةَ شِرْكٌ" (ابن ماجه:٣٥٣٠ صحيح)

**"నిశ్చయంగా మంత్రించి ఊదటం, తాయెత్తులు వేయటం, తివల**

https://teluguislam.net

**షిర్క్‌తో కూడుకున్నవి." (అహ్మద్, అబూదావూద్, ఇబ్నుమాజ–3530 సహీహ్, హాకిమ్)**

తివల అనేది కూడా ఒక విధమయిన చేతబడి (క్షుద్రవిద్య). దీని మూలంగా భర్త దృష్టిలో భార్య, భార్య దృష్టిలో భర్త ప్రియాతిప్రియమైన వారైపోతారన్నది ఆ విద్య చేయించే వారి తలంపు.

క్రింద పేర్కొనబడిన మూడు కారణాల దృష్ట్యా ఈ రెండవ అభిప్రాయమే సరైనది:

(1) సర్వసాధారణంగా తాయెత్తులు కట్టడం పట్ల వారింపు ఉంది. ఈ సర్వసాధారణ మును 'ప్రత్యేకం' చేసే ఆధారం ఏదీ కనబడదు.

(2) షిర్క్ ద్వారాలను మూసివేయటంలో ఈ 'వారింపు' ఉపయుక్తంగా ఉన్నది. కాగా; తావీజులు వ్రేలాడదీయవచ్చున్న ఫత్వా (ధార్మిక తీర్పు) షిర్క్‌తో కూడుకున్న తావీజులను ప్రోత్సహించేందుకు ఆస్కారముంది. అది ఏ విధంగానూ సమ్మతం కాదు.

(3) ఖుర్‌ఆనీ ఆయతులను తావీజుగా చేసి వ్రేలాడదీసినపుడు, అలా వ్రేలాడదీసేవాడు తప్పకుండా వాటిపట్ల అమర్యాదకరంగా ప్రవర్తిస్తాడు. ఎందుకంటే ఆ తావీజు కాలకృత్యాలు తీర్చుకునే సమయంలో కూడా అతని మెడలో వ్రేలాడుతూనో, చేతికి కట్టబడో ఉంటుంది. (ఫత్‌హుల్ మజీద్ : పేజి : 136)

## రెండవ రకం :

ఈ కోవలో ఖుర్‌ఆన్ సూక్తుల ఆధారంగా చేయబడిన తావీజులతో పాటు వేరితర తాయెత్తులన్నీ చేరి ఉంటాయి. ఉదాహరణకు : గవ్వలు, బొమికలు, దారాలు, వెంట్రుకలు, చిప్పలు, చెప్పులు, భూత పిశాచాల పేర్లు ఇత్యాదివి. ఈ రకమయిన తావీజులు ముమ్మాటికీ నిషిద్ధం (హరామ్). అవి ఖచ్చితంగా షిర్క్ క్రిందికి వస్తాయి. ఎందుకంటే ఈ రకమయిన వస్తువులలో అల్లాహ్ నామాల, వాక్యాల బదులు వాటిని ఇతరత్రా వాటితో ముడిపెట్టడం జరుగుతుంది. దైవేతరులను ఆశ్రయించటం జరుగుతుంది. కాగా; హదీసులో ఇలా ఉంది :

”مَنْ تَعَلَّقَ شَيْئاً وُكِلَ إِلَيْهِ“ (ترمذی:۲۰۷۲حسن:احمد)

**"ఎవరయినా ఏదయినా వస్తువుతో సంబంధం ఏర్పరచుకుంటే అతను దాని పరమే చేయబడతాడు." (అహ్మద్, తిర్మిజీ–2072 హసన్)**

అంటే దేవుడు అతన్ని ఆ వస్తువుకే అప్పగిస్తాడు. కనుక ఎవరయితే అల్లాహ్‌తో దృఢ సంబంధం ఏర్పరచుకుంటాడో, అల్లాహ్‌నే నమ్ముకుంటాడో, తన వ్యవహారాలన్నింటినీ అల్లాహ్ పరం చేస్తాడో అలాంటి వ్యక్తి కొరకు స్వయంగా అల్లాహ్‌యే చాలు. ఆయన ప్రతి దూరాన్ని అతనిపై దగ్గర చేస్తాడు. ప్రతి కష్టాన్ని అతని కోసం సులువు చేస్తాడు. మరెవరయితే అల్లాహ్‌ను గాకుండా ఇతర సృష్టితాలను ఆశ్రయిస్తాడో, తాయెత్తుల,

https://teluguislam.net

అధర్మమయిన విద్యల, సమాధుల, దర్గాల సహాయం కోర్తాడో అతను వాటికే అప్పగించ బడతాడు. అవి అతనికి ఏ విధంగానూ ఉపయోగపడవు. అతనికి లాభనష్టాలు కలిగించే శక్తి వాటికి ఉండదు. ఆ విధంగా అతని విశ్వాసం (అఖీదా) కూడా వ్యర్థమై పోతుంది. అల్లాహ్‌తో అతనికి గల సంబంధం కూడా తెగిపోతుంది. అల్లాహ్ అతనికి తోడ్పడటం మానుకుంటాడు.

కాబట్టి ముసల్మాను తన విశ్వాసానికి విఘాతం కలిగించే విషయాల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. కాబట్టి అతను అధర్మమైన మందులను, చికిత్సలను త్యజించాలి. తన రోగుల చికిత్స కోసం మాయలమారుల వద్దకు, మోసగాళ్ల వద్దకు పోరాదు. ఎందుకంటే అలాంటి దగాకోరులు అన్నిటికన్నా ముందు ఇతని హృదయాన్ని, ఇతని నమ్మకాన్ని రోగగ్రస్తం చేసేస్తారు. అల్లాహ్‌పై భరోసా చేసిన వాడికి అల్లాహ్‌యే చాలు.

కొంతమంది అవసరం లేకపోయినా తావీజులు పెట్టుకుంటారు. నిజానికి వారికి ఏ జబ్బూ ఉండదు. కాని వారు అనుమానమనే అతి పెద్ద రోగానికి లోనై ఉంటాడు. తమకు దిష్టి తగులుతుందని, ఇతరులు తమను చూసి ఈర్ష్య చెందుతారేమోనని పొద్దస్తమానం అనుమానిస్తూ ఉంటారు. అలాగే మరి కొంతమంది తమ వాహనాలకు, పశువులకు, లేదా ఇంటి గుమ్మానికి 'విరుగుడు'ను కడుతుంటారు. ఇదంతా విశ్వాస బలహీనత వల్ల అలా చేస్తారు. విశ్వాస బలహీనతే అసలు రోగం. దానికి చికిత్స తౌహీద్ (దేవుని ఏకత్వం), సిసలయిన విశ్వాసం ఆధారంగా చేయటం చాలా అవసరం.